## మహాప్రస్థానికపర్వ కథాంశాలు

మహాప్రస్థానికపర్వమున మూడు అధ్యాయములు, 110 శ్లోకములు కలవు.

**ప్రథమ అధ్యాయము-** ద్రౌపదితో కూడిన పాండవుల మహాప్రస్థానము-

మౌసలయుద్ధమున వృష్ణివంశీయుల పరస్పర సంహారము, శ్రీకృష్ణుడు పరమధామమునకు వెడలుట విని యుధిష్ఠిరుడు మహాప్రస్థానమునకు నిశ్చయించుకొని అర్జునునితో కాలమే సమస్తభూతములను పక్వముచేయుచున్నది. కాలబంధమును నేను అంగీకరించుచున్నాను. నీవు కూడా దీనిని గమనించగలవని పలికెను. అర్జునుడు సోదరుని మాటలకు అంగీకారము తెలిపెను. భీమ, నకుల, సహదేవులు కూడా సోదరుని మాటలను అంగీకరించిరి. పిమ్మట యుధిష్ఠిరుడు వైశ్యాపుత్రుడగు యుయుత్సునకు రాజ్యభారమును అప్పగించెను. పరీక్షిత్తును రాజ్యాభిషిక్తుని చేసెను. అతడు సుభద్రతో నీ పుత్రుని పుత్రుడగు పరీక్షిత్తు కురుదేశమునకు రాజుగానూ, శ్రీకృష్ణుని పౌత్రుడగు వజ్రుడు మిగిలిన యాదవులకు రాజుగానూ చేయబడిరని చెప్పెను. పిమ్మట పాండవులు వల్కములు ధరించి మహాప్రస్థానమునకు బయలుదేరిరి. ముందుగా యుధిష్ఠిరుడు వెడలగా అతనివెనుక క్రమముగా భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, ద్రౌపది నడచిరి. వారిని ఒక కుక్క అనుసరించెను. మార్గమున అగ్నిదేవుడు ప్రత్యక్షమాయెను. అతని ఆజ్ఞ ప్రకారము గాండీవ ధనుస్సును వరుణ భగవానునికి తిరిగి అప్పగించుటకు దానిని నీటిలో పడవేసెను. ముందుకు వెళ్ళి వారు సముద్రములో మునిగిన ద్వారకను చూసిరి.

**రెండవ అధ్యాయము:-** మార్గమధ్యమున ద్రౌపదీమున్నగువారు పడుటకు కారణమును యుధిష్ఠిరుడు చెప్పుట.

మహాప్రస్థానము సందర్భమున పాండవులు ఉత్తరదిక్కునకు యాత్రచేయుచూ హిమాలయ మేరుపర్వతములను చూచిరి. యోగధర్మమును స్వీకరించి మిక్కిలి వేగముగా వారు ముందుకు నడవసాగిరి. ఇంతలో యోగమునుండి మనస్సు భ్రష్టమగుటచే ద్రౌపది

నేలపై పడెను. భీమసేనుడు ద్రౌపది క్రిందపడుటకు  కారణమును యుధిష్ఠిరుని అడిగెను. యుధిష్ఠిరుడు అర్జునిని యెడల ద్రౌపదికి విశేషమగు ప్రేమగలదు. దాని ఫలితమే ఆమె అనుభవించుచున్నదని సమాధానము
చెప్పెను. మరికొంతసేపటికి సహదేవుడు కూడా నేలమీద పడెను. భీముడు కారణమడుగగా సహదేవుడు తనను గొప్పవిద్వాంసునిగా, తనతో సమానమైనవాడు మరొకడు లేనట్లు తలచుచున్నాడు. దాని ఫలితమే సహదేవుని పతనమని యుధిష్ఠిరుడు చెప్పెను. వారిద్దరిని విడిచి పాండవులు కుక్క అనుసరించగా ముందుకు సాగిరి. ద్రౌపదీసహదేవుల పతనమునకు చింతించిన నకులుడు కూడా నేలపై పడెను. నకులుడు ఎల్లప్పుడూ నేనే రూపవంతుడ నని అనుకుంటూ ఉంటాడు. దాని ఫలితము అనుభవించుచున్నాడని యుధిష్ఠిరుడు భీమునితో చెప్పాడు. ముగ్గురూ నేలపై పడుటచే మిక్కిలిదుఃఖించిన అర్జునుడు కూడా క్రిందపడెను. భీముడు అడుగగా యుధిష్ఠిరుడు అతనితో ఇట్లు చెప్పెను. అర్జునునకు తన పరాక్రమముమీద అభిమానము మెండు. ఒక్కరోజులోనే నేను శత్రువులనందరినీ భస్మముచేయగలనని తలచును. దీని ఫలము అనుభవించుచున్నాడు. ఇంతలో భీమసేనుడు కూడా క్రిందపడి యుధిష్ఠిరుని పిలిచి తానుపడుటకు కారణము అడిగెను. యుధిష్ఠిరుడు అతనితో  భీమసేనా! బలముపై నీకు గర్వముమెండు. ఇదియే నీవు పడుటకు కారణమని చెప్పి ముందుకు సాగెను. కుక్క కూడా అతనిని అనుసరించెను.

**మూడవ అధ్యాయము:--** ధర్మమందు దృఢవ్రతుడైన యుధిష్ఠిరుడు శరీరముతో స్వర్గలోకమునకు వెడలుట

దేవరాజగు ఇంద్రుడు రథముతో కూడా యుధిష్ఠిరుని దగ్గరకు వచ్చి రథము ఎక్కమని అడిగెను. అంతట యుధిష్ఠిరుడు  దేవేంద్రా! నా సోదరులు మార్గమున పడియున్నారు. వారిని కూడా నాతోబాటు తీసుకొనివెళ్ళుటకు ఏర్పాటుచేయవలసినది. వారు లేకుండగా నేను స్వర్గమునకు రాలేనని చెప్పెను. ఇంద్రుడు యుధిష్ఠిరునితో  ధర్మరాజా! ద్రౌపదితో కూడా నీసోదరులందరూ మానవశరీరమును విడిచి నీకంటే

ముందుగా స్వర్గము చేరిరి. నీవు సశరీరముగా స్వర్గమునకు వెళ్ళిబోవుచున్నావని చెప్పెను. అంతట యుధిష్ఠిరుడు దేవరాజా! ఈ కుక్క నా ఎడల భక్తికలిగినది. నన్ను అనుసరించుచూ ఇంతదూరము వచ్చినది. కనుక ఇది కూడా నాతో స్వర్గమునకు వచ్చునని పలికెను. కుక్కను విడచి యుధిష్ఠిరుని మాత్రము స్వర్గమునకు రమ్మని ఇంద్రుడు పలుకగా ధర్మరాజు తిరస్కరించెను. కుక్కకు స్వర్గలోకమున స్థానములేదు దానిని విడిచి నీవు ఒక్కడివే నాతో స్వర్గమునకు రమ్మని మరల ఇంద్రుడు చెప్పెను. భక్తుని విడిచిపెట్టుట మహాపాపము. కనుక నేను కుక్కను విడిచిపెట్టనని యుధిష్ఠిరుడు
చెప్పగా కుక్కను విడిచిపెట్టని ఎడల నీవు స్వర్గలోకమును చేరలేవని ఇంద్రుడు స్పష్టముచేసెను. అది విని యుధిష్ఠిరుడు శరణుకోరినవారికి భయము కల్గించుట, స్త్రీవధ, బ్రాహ్మణధనమును అపహరించుట, మిత్రద్రోహము ఈ నాలుగు కలిసిన ఎటువంటి అధర్మము కల్గునో దానికి సమానమగు అధర్మము భక్తుని విడిచిపెట్టినచో కల్గునని చెప్పగా కుక్కరూపము ధరించి వచ్చిన ధర్మదేవత మిక్కిలి సంతోషించి ఇట్లు పలికెను. పుత్రా! కుక్కను భక్తునిగా తలచి స్వర్గమును కూడా విడిచిపెట్టితివి. కనుక స్వర్గలోకమున నీతోసమానమైన రాజు ఎవ్వరూ లేరు అన్నాడు. పిమ్మట ధర్మదేవత, ఇంద్రుడు, ఋషిగణము యుధిష్ఠిరుని రథముపై ఎక్కించి తమతమ విమానములద్వారా స్వర్గలోకమునకు బయలుదేరిరి. యుధిష్ఠిరుడు తన యశస్సుతో రాజర్షికీర్తిని పొందినాడు. భౌతికశరీరముతో స్వర్గలోకమునచేరుట ఒక్క యుధిష్ఠిరునికే దక్కినదని నారదుడు పలికెను.

నారదమహర్షి మాటలు విని యుధిష్ఠిరుడు ఇంద్రునితో దేవేశ్వరా! నా సోదరులకు లభించిన స్థానమునే నేను కూడా పొందా లనుకొనుచున్నాను. ఇంతకుమించి మరియొక లోకమునకు వెళ్ళుట నేను ఇష్టపడనని యుధిష్ఠిరుడు చెప్పెను. అతని మాటలు విని ఇంద్రుడు శుభకర్మలద్వారా నీకు ఉత్తమగతి లభించినది. ఇది ఇతరులకు లభించదు. ఇట్టి స్థానమును నీ సోదరులు పొందలేకపోయిరి. కనుక నీవు స్వర్గలోకమున నివసించుమని యుధిష్ఠిరునికి చెప్పెను. తన సోదరులు, ద్రౌపది లేకుండగా ఇక్కడ ఉండుటకు నాకు ఉత్సాహము లేదు. కనుక నా సోదరులు ఎచట ఉన్నారో నేను కూడా అక్కడనే ఉంటానని ధర్మరాజు

పలికెను.

**ఇది మహాప్రస్థానికపర్వ కథాంశము.**